ప్రజాశక్తి
శనివారం 28 డిసెంబర్ 2024 5
శ్రీ సత్యసాయి

1 నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం : డిఇఓ

ప్రజాశక్తి-కొత్తచెరువు

రాష్ట్ర ప్రభుత్వం జనవరి 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభి స్తున్నందున, ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిఇఓ జి.కృష్ణప్ప, జిల్లా వృత్తి విద్యాధికారి లాజర్ ఆదేశించారు. వారు శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్‌లో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, ఎంఇఓలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అందులో ఎలాంటి ఇబ్బందులకు తావు లేకుండా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎడి నాగరాజు, ఎంఇఓలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఓ

ముంచుతున్న ముసురు

రైతుల్లో గుబులు
కమ్ముకొస్తున్న కారుమబ్బులు
కోత దశలో ముంచేస్తాయన్న ఆందోళన

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో పడుతున్న వర్షాలతో రైతుల్లో గుబులు నెలకొంది. రెండు రోజులుగా పడుతున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట చేతికొచ్చి నూర్పిడికి సిద్ధమవుతున్న సమయంలో కారుమబ్బులు కమ్ముకొస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షం ఏదీ నమోదకానప్పటికీ చిరుజల్లులు పడుతున్నాయి. ప్రధానంగా వరి, మొక్కజన్న, మిరప, పప్పుశనగ, పత్తి , కంది తదితర పంటలు కోత దశకు వచ్చి ఉన్నాయి. ఈ సమయంలో వర్షాలు పడితే పంట నాణ్యతపై ప్రభావం చూపే అవకశముందని రైతుల్లో ఆందోళన నెలకొంది.

హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలువ కింద కణేకల్, బొమ్మనహాల్ మండలాల్లో వరిపంట కోతలు పూర్తయి కుప్పల దశలోనున్నాయి. ధాన్యం ఆరబోసిన సమయంలో వర్షమొస్తుండటంతో తడవకుండా ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. సుమారు 35 వేల ఎకరాల్లో ఈ ప్రాంతంలో వరి పండించి ఉన్నారు. ఇందులో సగానికిపైగా కోతలు పూర్తయి ఉండగా, మరికొన్ని కుప్పలు ఆరోబోసి ఉన్నాయి. దాన్ని రక్షించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మిరప రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. గత నెలలోనూ వర్షాలతో మిరప పంటకు తెగుళ్ల వ్యాపించి ఉన్నాయి. ఇప్పుడు మరోమారు పడుతుండటంతో మరింతగా తెగుళ్ల వ్యాపించే ప్రమాదం ఉందని గుబులు చెందుతున్నారు. బొమ్మనహాల్, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఈ పంట సాగు అత్యధికంగా ఉంది. రబీలో పప్పుశనగ పంట జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ పంటకు కూడా తెగుళ్ల వ్యాపించి ఉన్నాయి. వర్షాలతో దిగుబడి తగ్గే అవకాశముంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంటకు కూడా కొంత వరకు ప్రతికూల పరిస్థితులు నెలకొనే అవకాశముంది.

చిరు జల్లులు

అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా చిరుజల్లులు పడుతున్నాయి.శుక్రవారం రోజు 16 మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదయింది. ఈనెల సాధారణ వర్షపాతం 9.2 మిల్లీమీటర్లు అయితే ఇప్పటిదాకా 16.6 మిల్లీమీటర్లు నమోదయింది.శుక్రవారం ఒక్క రోజే 1.2 మిల్లీమీటర్లు నమోదయింది. అధిక వర్షపాతం కానప్పటికీ పంటలపై మాత్రం తీవ్ర ప్రభావం చూపనుంది.

బొమ్మనహాల్ మండలంలో వరిధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పిన రైతులు

సంపద సృష్టి అంటే ప్రజలపై భారం వేయడమా.?

ప్రజాశక్తి-పెనుకొండ

సంపద సృష్టి అంటే ప్రజలపై భారం వేయడమా అని శ్రీసత్యసాయి జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ప్రశ్నించారు. విద్యుత్‌ఛార్జీల పెంపునకు నిరసనగా వైసిపి శుక్రవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించింది. పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆ పార్టీ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉష శ్రీ చరణ్ మాట్లాడుతూ అధికారం కోసం ప్రజలను నమ్మించడం, సిఎం కుర్చీలో కూర్చోగానే వంచించడం చంద్రబాబుకు అలవాటేనని అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచననితగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, ఆదాయ మార్గాలు లేకపోవడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెంచిన విద్యుత్‌ఛార్జీలు ప్రజలకు పెనుభారంగా మారుతున్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ' ఏమో గానీ ఇప్పుడు 'బాబు ష్యూరిటీ, బాదుడు గ్యారంటీ'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం విద్యుత్‌ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎఇఇ నారాయణ స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి జడ్పిటిసి అశోక్, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ బోయ నర్సింహులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోగాకు రామచంద్ర, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, గోపాల్ రెడ్డితో పాటు అధికసంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైసిపి నియోజక వర్గ ఇన్‌చార్జ్ దీపిక ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం అంబేద్కర్ సర్కిల్ నుంచి డిఈ కార్యలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యుత్‌శాఖ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతు అదనపు భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించాలని, ప్రజలపై మోపితే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మేన్ జబివుల్లా, కౌన్సిలర్లు షాజియా, మల్లికార్జున, ఆసీఫ్, వైసిపి నాయకులు వేణురెడ్డి, పురుషోత్తం రెడ్డి, మార్కెట్ చాంద్‌బాషా, నాగమణి, నాగరాజు, రాము, రామ్మూర్తి, రామకృష్ణారెడ్డితో పాటు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్
విద్యుత్‌ఛార్జీల పెంపునకు నిరసనగా పోరుబాట

పెనుకొండలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఉషశ్రీ చరణ్, తదితరులు

అల్ట్రాటెక్ యాజమాన్యానికి క్షమాపణలు చెబుతున్నా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

డబ్బు కోసం కాదు..ప్రతిష్ట కోసం
తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ : జేసీ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

అల్ట్రా టెక్ యాజమాన్యానికి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి క్షమాపణలు చెప్పారు. శు క్రవారం అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. గత కొంత కాలంగా ఫ్లైయాస్ విషయంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి, జేసీకి వధ్య వివాదం నడుస్తోంది. ఈ వివాదం నడుమ సిమెంటు పరిశ్రమకు అవసరమైన ఫ్లైయాస్ రావడంలో సమస్య తలెత్తుతూ వచ్చింది. పరస్పరం వాహనాలపై దాడులు చేసుకునే వరకు వెళ్లిఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రెడ్డి శు క్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాను డబ్బు కోసం గొడవ పడలేదని, ప్రతిష్ట కోసమని చెప్పారు. తమకు ఎందుకు అవకాశం లేదన్నదే అడుగుతున్నా అని చెప్పారు. ఈ విషయమై అనంతపురం రేంజ్ డిఐజి, కర్నూలు రేంజ్ డిఐజలతోపాటు అనంతపురం, కడప జిల్లాల ఎస్పీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. తన భార్య, కుమారుల సూచన మేరకు తాడిపత్రి ప్రాంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివాదాన్ని సద్దుమణిచేందుకు తాను అల్ట్రాటెక్ యాజమాన్యానికి క్షమాపణలు చెబుతున్నానని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్, చేతన్

కలెక్టర్ టిఎస్. చేతన్

పజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ రహదారులలో ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలలో మరణాల సంఖ్య తగ్గించడానికి పగడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్ష పడేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రదేశాలను ఒక కమిటీ ద్వారా గుర్తించి తగిన కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. హెల్మెట్ లేని వారి పైన ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. వాహనాల వల్ల జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా వాహన ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన రహదారుల వద్ద ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో ప్రమాదాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 31 చోట్ల ప్రమాద స్థలాలను గుర్తించినట్లు అధికారుల ద్వారా తెలిసిందన్నారు. ఆయా ప్రదేశాలను కమిటీ సభ్యులు పరిశీలించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల ప్రక్కన ఉన్న దాబాలు, రెస్టారెంట్ల వద్ద సీసీ కెమెరాలు ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతపై ప్రతి మూడు నెలలకు ఒకసారి ర్యాలీలు, భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్లతో కూడా సమీక్ష సమావేశాలు నిర్వహించుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రావు, ఎన్‌హెచ్ఎ అధికారి భరత్, డిఎంహెచ్ఓ మంజువాణి, ఆర్అండ్‌బి ఎస్ఇ సంజీవరావు, ఆర్టీసీ జిల్లా అధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ధర్మవరం రూరల్ : ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం యంత్రాలు, వివిప్యాట్ భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఎప్పటి కప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ తనిఖీ జరిగింది. జిల్లా కలెక్టర్ వెంట ధర్మవరం ఆర్డీవో మహేష్, ధర్మవరం తహశీల్దార్ నటరాజ్ , ఆయా పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు మోక్షమెప్పుడో..?

అర్ధాంతరంగా ఆగిన సచివాలయ, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలు

అర్ధాంతరంగా ఆగిన సచివాలయ భవన నిర్మాణం

ప్రజాశక్తి-అగళి

గత వైసిపి ప్రభుత్వంలో మండల వ్యాప్తంగా 11 పంచాయతీల్లో 11 సచివాలయ, 11 ఆర్‌బికె, 9 వెల్‌నెస్ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయి. అందులో ఇరిగేపల్లి, అర్జిపల్లిలో మాత్రమే సచివా లయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 9 పంచాయతీల్లో సచి వాలయ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయినాయి. 11 పంచాయతీల్లో ఆర్‌బికె భవనం ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఒక్కో సచివాలయానికి రూ. 43.6 లక్షలు, ఆర్‌బికెకు రూ. 21.8 లక్షలు, వెల్‌నెస్ సెంటర్లకు రూ. 17.5 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. అయితే ఆయా భవనాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఇక ఆ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ఆయా పంచాయతీల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే గుత్తేదారులు 50 శాతం వరకూ నిధులు డ్రా చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన నిధుల గురించి చెప్పేవారెవరూ లేరు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి ఆ నిధుల విషయం తేల్చడంతో పాటు ఆయా భవనాలను పూర్తి చేసి ప్రజలకు సేవలు అందించాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో గాంధీ సర్కిల్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం కోసం చౌడేశ్వరి ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, ఆయన కుమారుడు బండారు ప్రవీణ్ రూ.2,01,116లు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ విరాళాన్ని అందించిన బండారు బాలాజీ కుటుంబాన్ని ఆలయ కమిటీలో కమిటీ శాశ్వత సభ్యత్వంగా నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చంద్రమోహన్, కౌన్సిలర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

2025 ప్రజాశక్తి క్యాలెండర్‌ను శుక్రవారం పట్టణంలోని మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, డిఇ బాలసుబ్రమణ్యం, తహశీల్దార్ కార్యలయంలో తహశీల్దార్ వెంకటేశు, ఇతర రెవిన్యూ అధికారులు ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రజాశక్తి దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ప్రజాశక్తి ఆవిష్కరణలు ప్రజలకు చైతన్య పూరితంగా, మార్గదర్శకంగాను ఉంటాయని అన్నారు. కొత్త ఆవిష్కరణలకు ప్రజాశక్తి వేదికగా ఉండటం సమస్యల పట్ల అంకిత భావంతో పనిచేసే సిబ్బందిని తయారు చేయడం గొప్ప పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ అమరేంద్ర, విఆర్ఒల సంఘం అధ్యక్షులు అనిల్, ప్రజాశక్తి రిపోర్టర్ షబ్బీర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల్లో క్యాలెండర్ విడుదల చేస్తున్న అధికారులు, తదితరులు

విద్యార్థినులకు దుస్తులు అందజేస్తున్న నిర్మలన్

ఉత్తమ వ్యక్తిత్వమే గొప్ప ఆభరణం

ప్రజాశక్తి-హిందూపురం

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఆదర్శ పౌరులుగా పరిగణించబడతారని శ్రీలంక దేశానికి చెందిన ప్రముఖ వక్త నిర్మలన్ పేర్కొన్నారు. స్థానిక ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో "వ్యక్తిత్వ వికాసం" పై జరిగిన సెమినార్‌కి నిర్మలన్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. యువత సేవా గుణాన్ని పెంపొందించుకొని సమాజానికి తమ వంతు సహాయాన్ని అందించాలన్నారు. డ్రగ్ రహిత సమాజం కోసం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ సేవలను కొనియాడుతూ ఇటీవల జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికై, పాల్గొన్న కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ సాయి హర్షితను ఈసందర్భంగా అభినందించారు. అనంతరం 110 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు యూనిఫామ్, క్యాప్స్, పెన్నులు బహూకరించారు. దాతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రగతి, సీనియర్ అధ్యాపకులు ఎల్. ఆర్.రమేష్ ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్. బోజప్ప, డాక్టర్. ప్రకాష్ రావ్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

పరిశ్రమలు స్థాపించాలంటే తప్పనిసరిగా అనుమతులు అవసరమని అదే విధంగా ఆ స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పెనుకొండ ఆర్డీవో ఆనందరావు పేర్కొన్నారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట, గోళ్లాపురం ప్రాంతాల్లో నియోజిన్ ప్రాపర్టీస్ లిమిటెడ్ 350 ఎకరాల్లో స్థాపించనున్న పరిశ్రమల పార్కు ఏర్పాటు కోసం పర్యావరణ అనుమతుల నిమిత్తం శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆయా గ్రామాల ప్రజలు, ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆంధ్రా, కర్ణాటక పర్యావరణ సంస్థలతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిశ్రమల స్థాపన కోసం ఆయా గ్రామాల్లో ప్రజల నుండి అభిప్రాయల సేకరణ కోసం గ్రామ సభ నిర్వహించామన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బ తినకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రాంతంలో పర్యావరణం ఏమాత్రం దెబ్బతినకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా పారిశ్రామికవేత్తలపై ఉంటుందని ఆయన తెలిపారు. గ్రామసభల ద్వారా వచ్చిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి అందుకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ ముని ప్రసాద్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతిని అందజేస్తున్న రైతు

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాల్సిందే : వైసిపి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాల్సిందేనని వైసిపి శ్రేణులు పెద్దఎత్తున నినదించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకూ భారీ ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. శ్రీధర్‌రెడిడ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు విద్యుత్ ఛార్జీలను ఎట్టి పరిస్థితుల్లో పెంచమని, అవసరమైతే తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రూ. 15వేల కోట్ల విద్యుత్ భారాలు మోపి ప్రజల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎంపి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల విషయంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. రైతులకు పెట్టుబడి, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం హామీలు ఏమయ్యాయని నిలదీశారు. వెంటనే విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఆ పార్టీ మండల కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, చైర్మన్ ఓబుళపతి, ఎంపిపి ఎవి. రమణారెడ్డి, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, నాయకులు ఆవుటాల రమణారెడ్డి, కొత్తచెరువు నాగభూషణం, వాల్మీకి శంకర్, లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్ సాయి గీత, సాయిలీల, కవిత పాల్గొన్నారు.

పుట్టపర్తిలో ర్యాలీ చేపట్టిన వైసిపి నాయకులు

ధర్మవరంలో కేతిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన వైసిపి నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించాలి

ధర్మవరం రూరల్ : విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహ రించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ కేతిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని వైసిపి కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి కాలేజీ కూడలి మీదగా స్థానిక విద్యుత్ కార్యాలయం వెళ్లి ఎడి నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కేతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి ప్రజల నడ్డివిరిచేలా విద్యుత్ ఛార్జీలు పెంచిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చు కోకపోతే ప్రజల పక్షాన వైసిపి క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసులు, రేగాటిపల్లి సురేష్‌రెడ్డి, బాలిరెడ్డి, చందమూరు నారాయణరెడ్డి, సాయి, చౌడప్ప, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అధినేత సమక్షంలో బహిర్గతమైన వైసిపి వర్గపోరు

ప్రజాశక్తి-సోమందేపల్లి

పెనుకొండ నియోజకవర్గ వైసిపిలో వర్గ విభేదాలు శుక్రవారం మరోమారు వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలోనే బయటపడ్డ పడ్డాయి. వివరాలు.. రోడ్డు మార్గంలో పులివెందుల నుంచి బెంగళూరుకు వెళ్లే క్రమంలో జగన్ 44వ జాతీయ రహదారిపై వెళ్తుండగా సోమందేపల్లిలో ఆ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో మాజీ మంత్రి శంకరనారాయణ వర్గం ఓ వైపు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉషశ్రీచరణ్ వర్గం మరో వైపు నిల్చొని ఎవరికి వారు జై జగన్.. జై శంకరనారాయణ, జై జగన్.. జై ఉషశ్రీచరణ్ అని పెద్దఎత్తున నినదించారు. ఈ విషయం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో ఇలాంటి వర్గ పోరు వల్లే పలువురు కార్యకర్తలపై కేసులు బనాయించి కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. గత ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఘోర పరాభవానికి వర్గ విభేదాలే ప్రధాన కారణమని సామాన్యులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా జగన్ కాన్వాయ్ వైఎస్ఆర్ సర్కిల్‌కు చేరుకోగానే పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచాల పేల్చి పూలు జల్లి ఘన స్వాగతం పలికారు. జగన్ కారులో నుంచి బయటకు వచ్చి అభివాదం చేశారు. అలాగే పలువురికి సెల్ఫీలు ఇచ్చారు. అనంతరం బెంగళూరు వైపు వెళ్లిపోయాడు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివాసులు, శంకరనారాయణ వర్గం నేతలు ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం, ఉప సర్పంచి వేణు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగన్ కరచాలనం కోసం ఎగబడుతున్న వైసిపి నాయకులు

ఎస్సీ కులగణనపై 10 వరకూ సోషల్ ఆడిట్ : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎస్సీ కుల గణనపై జనవరి 10వ తేదీ వరకూ సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ జనాభా, వారి వివరాలు, పేరు, ఆధార్ నంబర్, పుట్టినతేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీరు, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం నుంచి గ్రామ, వార్డు సచివాల యాల్లో ప్రదర్శన, డిసెంబర్ 31వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందన్నారు. జనవరి 10న కుల గణన తుది వివరాలు పొందుపరుస్తామని తెలిపారు. డేటాపై అభ్యంతరాలను వీఆర్వో స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారన్నారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను సంబంధిత రెవెన్యూ అధికారికి నివేదిస్తారన్నారు. వీటిని పునఃపరిశీలించి తహశీల్దార్‌కు సిఫారసు చేస్తారని, తహశీల్దార్ వీఆర్వో నివేదికలోని వివరాలను పరిశీలించి, తుది ఆమోదం తెలిపి ఆ వివరాలను పోర్టల్‌లో పొందుపరుస్తారని తెలిపారు.

జగన్‌ను కలిసిన వాల్మీకి శంకర్

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన వాల్మీకి శంకర్

ప్రజాశక్తి-కొత్తచెరువు

వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని పులివెందులలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకుడు వాల్మీకి శంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఈయన జగన్‌తో పాటు పాదయాత్రలో పాల్గొన్న విషయం తెలిసిందే. జగన్ జిల్లాలో వైసిపి, రాజకీయ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలని శంకర్‌కు సూచించారు.

పుట్టపర్తి వాసికి సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వినియోగదారుల్లో చైతన్యం కోసం కృషి చేస్తున్న రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.సురేష్‌కుమార్ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం సేవారత్న అవార్డు ప్రదానం చేసింది. పుట్టపర్తికి చెందిన జి.సురేష్‌కుమార్ గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి ఈ అవార్డు అందుకున్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు నిత్యం మోసపోతు న్నారన్నారు. కావున విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే పాఠ్యాంశాల్లో చట్టాల గురించి ప్రవేశపెడితే బాగుంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. నిరంతరం వినియోగదారుల్లో చైతన్యం కోసం కృషి చేస్తామన్నారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన రాష్ట్ర కమిషనర్, కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అవార్డు అందుకుంటున్న సురేష్ కుమార్

30న మండల సమావేశం

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఎంపిపి బి.గంగోజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ బి.వెంకటరామిరెడ్డి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, జడ్పిటిసి, మండల కో ఆప్షన్ సభ్యుడు, ఎంపిటిసిలు, సర్పంచులు విధిగా హాజరు కావాలని తెలిపారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి శుక్రవారం పట్టణంలో ఎఐసిసి శాశ్వత సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. దేశాభివృద్ధి కోసం మంచి ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చిన మహానేత మన్మోహన్ సింగ్ అని, ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో ఎమ్మెల్యేగా పని చేయడం గర్వంగా ఉందన్నారు.

కొత్తచెరువు : కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన దేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో నాయకులు షామీర్ బాయ్, మహబూబ్‌బాషా, లక్ష్మీనారాయణ, అయూబ్, వెంకటేష్, రఫీ, షమీవుల్లా, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ స్వమన్వయకర్త నరేష్ యనమల తెలిపారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల పట్టణంలోని ఆ పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నరేష్ మాట్లాడుతూ భారతదేశం రైతు రుణమాఫీ, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, సమాచార హక్కు, ఆహార భద్రత, విద్యా హక్కు చట్టంతో పాటు దాదాపు 14 రకాల చట్టాలను తీసుకొచ్చి చరిత్ర పుటలోల నిలిచిపోయారని కొనియాడారు.

ముదిగుబ్బ : స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి ఎన్నో సేవలు చేశారని, ఆయన మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.ప్రభాకర్, నిషార్, అనిల్, రమణ, తదితరులు పాల్గొన్నారు

సోమందేపల్లి : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మండల కన్వీనర్ గంగాధర్ పేర్కొన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఆర్థికవేత్త, సంకీర్ణ ప్రభుత్వాన్ని ఎలాంటి సమస్యలు లేకుండా సమర్థవంతంగా నడిపిన రాజకీయవేత్త మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, రాయప్ప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కదిరి టౌన్ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశం, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని చిలమత్తూరు మోహన్‌గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలకృష్ణయాదవ్, అశ్రఫ్, నీలోఫర్, షౌకత్‌అలీఖాన్, జాఫర్, చంద్ర, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ఎంఎండిఎ కార్యాలయంలో ఎంఎండిఎ జిల్లా అధ్యక్షులు రోషన్ జమీర్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు మన్మోహన్‌సింగ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు దాదాపీర్, సభ్యులు కరీం, షాషావలి, జిక్రియ, నబిరసూల్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక ఎంజెపి పాఠశాలలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంజెపి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఏఐసీసీ సభ్యులు, సేవా మందిరం సంస్థ చైర్మన్ కేటి శ్రీధర్ పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో సేవా మందిరం సంస్థ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా హిందూపురం పట్టణం లోని ఇందిరాగాంధీ సర్కిల్ లో స్వర్గీయ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ కిరణ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షాహిద్, కలేమ్, హనుమంతరాయుడు, జియా, సలాం, రియాజ్ యూత్ కాంగ్రెస్ అంజి తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార యాత్ర విజయవంతం

ప్రజాశక్తి-మడకశిర

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార యాత్ర శుక్రవారం మడకశిర నుంచి ప్రారంభమైంది. ముందుగా జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు కె.భూతన్న పట్టణంలోని వాల్మీకి బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. బుల్లసముద్రం జడ్పీ హైస్కూల్‌లో జెండాను ఆవిష్కరిం చారు. మహాసభల్లో విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై చర్చిస్తారని, ఈ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వారు మాట్లాడుతూ సిపిఎస్, 117 జిఒ రద్దు, 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని, 12వ పిఆర్‌సి అమలు చేసేలోపు 30శాతం ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాయణ స్వామి, జిల్లా కార్యదర్శులు నరసింహప్ప, జిసి.నరేష్‌కుమార్, మాలింగప్ప, హరికృష్ణ, ఈశ్వర్, ఓబన్న, నంజప్ప, నర్సింహ మూర్తి, గంగాధర్, నరసింహులు, కదిరన్న, బాబు, రామాంజనేయులు, నరసింహరాజు, వేదాచలం, దత్తాత్రేయ, మహంతేష్, అనిల్, రంగనాథ్, ప్రభురాజ్, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రభుత్వ విద్యా రంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ప్రధాన అజెండాగా జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మిరాజా, కోటేశ్వరప్ప పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ యుటిఎఫ్ చేపట్టిన స్వర్ణోత్సవ ప్రచార యాత్ర హిందూపురం చేరుకుంది. పట్టణంలోని ఎన్‌జిఒ హోం ఎదురుగా ఉన్న సర్కిల్‌లో యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా సహాధ్యక్షులు జిహెచ్.బాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.మారుతి శ్రీనివాస్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేష్, చెన్నకేశవులు, అనిల్, హనుమంతప్ప, చంద్రశేఖర్, శంకరప్ప, సుల్తాన్, రంగనాథ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో ర్యాలీ చేపట్టిన యుటిఎఫ్ నాయకులు

కదిరి టౌన్ : మడకశిర నుంచి ప్రారంభ హిందూపురం, గోరంట్ల మీదుగా సాగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార యాత్ర కోనేరు వద్ద పట్టణంలో ప్రవేశించగా స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ యాత్రను కదిరిలో ముగించారు. నాయకులు మాట్లాడుతూ స్వర్ణోత్సవ మహాసభలకు కదిరి ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వైవి.సుబ్బారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, నాయకులు సునీల్‌కుమార్, బ్రహ్మేంద్ర, నాగరాజు, హనీఫ్, సంతోష్, లక్ష్మీప్రసాద్, ఖాదర్‌బాషా, రామ సుబ్బయ్య, వెంకటనారాయణరెడ్డి, నాగరాజునాయక్, రవివర్ధన్‌రెడ్డి, నజీర్, ఇర్ఫాన్, భార్గవ్, మధుసూదన్‌రెడ్డి, రాజేష్, కిషోర్, జబీవుల్లా, మానస, అనిత, వనజ, శోభ, ప్రత్యూష పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ రంగం ప్రయివేటీకరణను ఉపసంహరించాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ద్వారా ఆర్టీవో ఆఫీస్ నుంచే జారీ చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ప్రజల భద్రత దృష్ట్యా డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్‌ను జారీ చేసే వ్యవస్థను 2025 జనవరి నుంచి ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలనుకోవడం తగదన్నారు. ప్రయివేట్ పరం అయితే ఆర్టీవో ఆఫీసు నష్టాల్లోకి వెళ్తుందని, తద్వారా ట్రాన్స్‌పోర్ట్ రంగం సర్వీసులను పూర్తిగా ప్రయివేటుపరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచన చేస్తుందన్నారు. అలాగే ప్రజలపై ట్యాక్స్‌ల రూపంలో భారాలు పడతాయని, ప్రజల భద్రత ప్రయివేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లి ప్రశ్నార్థకం అవుతుందన్నారు. కావున ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, మహబూబ్‌బాషా, తిప్పన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, ఆటో యూనియన్ నాయకులు ఆటో నాగప్ప, రెడ్డప్పరెడ్డి, మురళి, సివిల్ సప్లై యూనియన్ నాయకులు సుధాకర్, హనుమంతు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ఆలయాలకు నీటి ట్యాంకులు వితరణ

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

పట్టణంలోని యువర్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు ఆలయాలకు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర, వ్యవస్థాపకులు పోలా ప్రభాకర్ మాట్లాడుతూ వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త రామచంద్రగుప్త, కుమార్తెలు నీరజాదేవి, షర్మిళాదేవి, హేలాసదేవి సహకారంతో హంపాపురం ఆంజనేయస్వామి క్షేత్రానికి, ఇందిరమ్మ కాలనీలోని అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, ధర్మవరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సత్రశాల మల్లికార్జున, జయంతి వినోద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



నీటి ట్యాంకులను పంపిణీ చేస్తున్న దాతలు

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని ఆర్.అనంతపురం ఎంపిటిసి సభ్యురాలు లక్ష్మీనరసమ్మ హనుమంతు కుమార్తె శివమణి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న నియోజక వర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప, జడ్పిటిసిలు సరోజామూర్తి, అనంతరాజు, ఎంపిపి కవితా సత్యనారాయణ ఆ గ్రామం వెళ్లి శివమణి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట వైసిపి ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంజునాథ, జెసిఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, మాలగౌడ్ ఉన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. ఎండుతున్న పంటలు

ప్రజాశక్తి-తాడిమర్రి

పంటలు ఎండుతున్నాయి.. వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని మండలంలోని ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. గ్రామంలో గొంగటి ఎల్లమ్మ, గొంగటి లక్ష్మీదేవి పేరు మీద ఉన్న పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ కోసం వారు డీడీలు చెల్లించారు. అయితే ఇప్పటి వరకూ విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన మెటీరియల్ పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. దీంతో నీరందక సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విద్యుత్ పరికరాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణ పరిధిలోని కుటాగుళ్ల సమీపంలోని ఓబులేశ్వర డిఫెన్స్ అకాడమీలో శుక్రవారం జన సురక్ష, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ వీర మారుతి, అడ్వకేట్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేస్తారో వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి పాస్‌వర్డ్, ఒటిపి, పిన్, సివివి చెప్పవద్దన్నారు. తెలియని ఎలాంటి యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. ఒకవేళ మీరు మోసపోయారని అనుమానం వస్తే సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. సేవ్ క్రైమ్.జిఒవి.ఇన్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సదస్సులో అకాడమీ ఛైర్మన్ ఓబులేష్, సిబ్బంది ప్రతాప్, మోహన్‌రెడ్డి, భార్గవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న వీర మారుతి, ప్రభాకర్‌రెడ్డి, ఓబులేసు

యువరైతు నవీన్‌కి అభినందనలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పరిగి మండలంలోని శాసనకోట గ్రామానికి చెందిన యువ రైతు నవీన్‌కుమార్ వినూత్నంగా రైతులు, సమాజంలోని ఇతర సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నవంబర్ 17వ తేదీ శాసనకోట నుంచి ప్రారంభించి మంగళగిరి వరకూ ఎడ్లబండిపై యాత్ర చేపట్టారు. మధ్యలో రైతులను కలిసి వారితో చర్చించి పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ నెల 14వ తేదీ మంగళగిరి చేరుకుని 16వ తేదీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి రైతుల సమస్యలను ఆయనకు వివరించారు. యాత్ర ముగించుకుని తిరిగి వెళుతుండగా మార్గమధ్యలో శుక్రవారం కదిరికి చేరుకోగా పట్టణవాసులు, రైతులు ఘనం స్వాగతం పలికి నవీన్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

చెట్ల సంరక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విరివిగా మొక్కలు పెంచడం, చెట్ల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ డాక్టర్ బి.రమణమూర్తి తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి జాతీయ సేవా పథం ఆధ్వర్యంలో మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులు విద్యార్థులు పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు పరిశుభ్రత, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్, ఎంకె.జ్యోష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసిపి డ్రామాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసిపి శ్రేణులు కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సోమశేఖర్ విమర్శించారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రజలపై వివిధ రకాలుగా భారాలు మోపి నేడు ఇలా రోడ్డెక్కడం హాస్యాస్పదమన్నారు. జగన్ గత ఐదేళ్లలో ఎన్నిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారో గుర్తు చేసుకోవాలన్నారు. వారి పాలనలో ఒక్కరోజైనా రైతుల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. గత ఐదేళ్లల్లో రాష్ట్రంలో విద్యుత్ రంగానికి జగన్ లక్ష కోట్లకు పైగా నష్టం చేశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి రూ. 32,166 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. ఇకనైనా ఇలాంటి డ్రామాలు ఆపేయాలని హితవు పలికారు.

దొంగ అరెస్ట్.. బంగారు ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మహిళలకు మాయమాటలు చెప్పి బంగారు ఆభరణాలు అపహరించిన ఓ దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామగిరి మండలంలోని నసనకోట గ్రామానికి చెందిన సాకే నారాయణ ప్రస్తుతం స్థానిక కేతిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మహిళలకు మాయమాటలు చెప్పి బంగారు ఆభరణాలు దొంగలించడం, తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడేవాడు. ఇటీవల ఎల్‌సికె పురంలో రాత్రి వేళ ఓ ఇంటి తాళం పగలగొట్టి బంగారు వస్తువులు ఎత్తుకెళ్లాడు. ఆయా సంఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్థానిక ఎర్రగుంట సర్కిల్ వద్ద వన్‌టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ గోపి కుమార్, పోలీసులు శివకుమార్, శివశంకర్, భాస్కర్ చాకచక్యంగా సాకే నారాయణను అరెస్టు చేశారు. అతడి నుంచి బంగారు కమ్మలు, గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగను అరెస్టు చేసిన సిఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని దాడితోట గ్రామానికి చెందిన రాజేష్ ఆటోలో చిల్లకొండయ్యపల్లి గ్రామం వచ్చి పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో అదే గ్రామానికి చెందిన రాజేష్, సోమశేఖర్ ఉండగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన బ్యాంక్ శివయ్య దాడితోట గ్రామానికి తీసుకెళ్లాడు.

రేపు ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బీడుపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 29వ తేదీ ఎస్‌టియు జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు-వాటి పరిష్కార మార్గాలు, విద్యారంగంలో సవాళ్లు, తదితర విషయాలపై చర్చిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌టియు కార్యకర్తలు, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మహారాజశ్రీ అనంతపురం 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, అనంతపురం
O.S.NO:426/2019
Between:
State Bank Of India In Touch Branch by its Branch Manager. ...plaintiff
And
1.Besta Babu, 2.Pakam Sulthan Mohiddin ...Defendants
1వ ప్రతివాదికి యిచ్చిన కోర్టు నోటీసు
To
Besta Babu S/o Besta Venkatanna, Major, Residing at D.No:28/2/187/B Navodaya Colony, Ananthapur Working as Office Subordinate PHC, N.P.Kunta, Sri Sathya Sai District.
అయ్యా..
వాది అయిన బ్యాంకు వారు తమ బాకీని రాబట్టు కొనుటకు పై తెలిపిన ఘనమైన కోర్టు నందు దావా వేసి ఉన్నారు. మీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా 30/12/2025 న ఉన్నది. కావున మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. అటుల లేని యెడల మీ పరోక్షమున తీర్మానము అగునని తెలుపడమైనది. వాయిదా:30/12/2025 ఉదయం 10:30 నిమిషములకు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఇచ్చిన కోర్టు నోటీసు)
యం.వరదరాజు
వాదిపరం వకీలు, అనంతపురం